# గంజాయి గమ్మత్తు



**పల్లెల్లో గుట్టుచప్పుడుకాకుండా దందా**

- 100 గ్రాముల ప్యాకెట్‌కు రూ. 200 నుంచి రూ. 300 దాకా విక్రయం
- నిషాలో పడి చిత్తవుతున్న యువత
- సిగరేట్లలో నింపుకొని సేవిస్తున్న వైనం
- బయటకు చెప్పకోలేని తల్లిదండ్రులు
- అడుకట్ట వేయలేకపోతున్న పోలీసులు



గుడిపేట బెటాలియన్ సమీపంలో యువత పడేసిన సిగరెట్ పీకలు (ఫైల్)

హాజీపూర్, మే 2 : పల్లెల్లో గంజాయి గుప్పుమంటున్నది. గుట్టుచప్పుడుకాకుండా దందా సాగుతుండగా, నిషా మత్తులో పడి యువత చిత్తవుతున్నది. ఏప్రిల్ 27న సబ్బుపెల్లి గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న ఆరుగురిని పోలీసులకు పట్టుకొని.. 70 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతూనే గంజాయివంటివి సేవిస్తుండగా, పిల్లల భవిష్యత్‌పై వారి తల్లింద్రులు మదన పడుతున్నారు. దేవాపూర్‌లోని ఓ గిరిజన ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుస్తుండగా, అక్కడి నుంచి యువతకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. వంద గ్రాములుండే ఒక గంజాయి ప్యాకెట్‌ను రూ. 200 నుంచి రూ. 300 దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. యువకులు నిర్మానుష్య ప్రాంతాలకు చేరుకొని గంజాయిని సిగరెట్లలో నింపుకొని సేవిస్తున్నట్లు తెలుస్తున్నది. మత్తు దిగేవరకూ ఇంటికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతూ తగదాలకు పాల్పడుతున్నట్లు వినిపిస్తున్నది. ప్రధానంగా హాజీపూర్ మండల కేంద్రానికి సమీపంలోని గుడిపేట, రాపల్లి, నర్సింగాపూర్, పడ్తన్‌పల్లి, కర్నమామిడి గ్రామాల్లోని యువత దీనికి అలవాటు పడ్డట్లు తెలుస్తుంది. ఈ విషయం కొందరి తల్లిదండ్రులకు తెలిసినా.. పోలీసులకు సమాచారం ఇస్తే తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని లోలోపలే కుమిలిపోతున్నారు. మూడేళ్ల క్రితం ఇక్కడ ఏసీపీగా పని చేసిన గౌస్‌బాబా గంజాయికి అలవాటు పడిన యువకులను గుర్తించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ స్థానిక పోలీసులు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. గంజాయి, పేకాట, కోడి పందేలవంటివి జోరుగా సాగుతున్నా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా గంజాయి సాగు, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టి యువకులను కాపాడాలని వారి తల్లితండ్రులు కోరుతున్నారు.

### అవగాహన కల్పిస్తాం..

**- ఆకుల అశోక్, మంచిర్యాల రూరల్ సీఐ**

గంజాయి వాడితే కలిగే నష్టం గురించి ప్రజలు, యువతకు అవగాహన కల్పిస్తాం. ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తాం. గంజాయి సాగు, సరఫరాపై ప్రత్యేక నిఘా పెడుతాం. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాదెసత్యం, నాయకులు

# మంచిర్యాల బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

మంచిర్యాల టౌన్, మే 2: పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల బంద్‌కు పిలుపునివ్వగా, తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం తెలిపారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులతో కలిసి మాట్లాడారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక, చాంబర్ ఆఫ్ కామర్స్, కార్మిక, కుల సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి బంద్‌కు పిలుపునిచ్చాయని, ఇందుకు బీఆర్ఎస్ మద్దతు పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బేర సత్యనారాయణ, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, అక్కూరి సుబ్బయ్య, జాఫర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బ తిన్న 196 స్తంభాలు

## పునరుద్ధరణ పనులను పర్యవేక్షించిన సీఈ


మంచిర్యాలటౌన్, మే 2 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి 196 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు జిల్లా ఎస్ఈ గంగాధర్ తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ లేన్‌లు, స్తంభాలను ఎన్‌పీడీసీఎల్ సీఈ ఆపరేషన్స్ బుస్స అశోక్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విద్యుత్ సిబ్బంది రాత్రంతా కష్టపడి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు కంట్రోల్‌రూం నుంచి నిరంతరం పర్యవేక్షణ చేశారని గంగాధర్ తెలిపారు. జిల్లాలోని పౌనూర్, పోలంపల్లి, నర్సింగాపూర్, బూరుగుపల్లి, రెడ్డిపల్లి, దాంపూర్, కాజిపల్లి, ధర్మారం, చంద్రవెల్లి, ఆవడం, నెన్నెల, జజ్జెరెల్లి, భీమిని ప్రాంతాల్లో విద్యుత్ లేన్లు, స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు.



నెన్నెల సెక్షన్‌లో విద్యుత్ పనులను పరిశీలిస్తున్న సీఈ, డీఈ



భీమారంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ



నెన్నెలలో ఇంటిపై కూలిన చెట్లు



నెన్నెల : దెబ్బ తిన్న ఇండ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ



నెన్నెల : రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు



కన్నెపల్లి : కూలిన రేకులు

# గాలివాన బీభత్సం

**మంచిర్యాల జిల్లాలో గురువారం రాత్రి ఉరుములు.. మెరుపులతో వర్షం**

- చేతికొస్తున్న దశలో రాలిపోయిన మామిడి కాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దయిన ధాన్యం
- లేచిపోయిన ఇండ్లు, రేకుల షెడ్ల పై కప్పులు
- పలువురికి తీవ్ర గాయాలు
- చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయి నిలిచిన విద్యుత్ సరఫరా
- దెబ్బ తిన్న పంటలు, ఇండ్లను పరిశీలించిన అధికారులు

నెన్నెల, మే 2 : మంచిర్యాల జిల్లాలో గురువారం రాత్రి గాలి, వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల ఇండ్లు, రేకుల షెడ్ల పై కప్పులు లేచిపోగా, అక్కడక్కడా చెట్లు, స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. అనేకచోట్ల మామిడి కాయలు రాలిపోగా, కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం తడిసిపోయి రైతాంగానికి తీవ్ర నష్టం జరిగింది. నెన్నెల మండలంలో అక్కడక్కడా వడగండ్లు పడ్డాయి. గంగారం, ఆవుడం, చిన్నవెంకటాపూర్, కొత్తూర్, ఘన్‌పూర్, చిత్తాపూర్, నెన్నెల, ఘన్‌పూర్, నందులపల్లి గ్రామాల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. చాలా వరకు పూరి గుడిసెలు, రేకులు, పెంకుటిండ్లు దెబ్బతిన్నాయి. సుమారు 10 మంది రేకులు, ఇటుకలు తగిలి గాయపడగా, దవాఖానకు తరలించారు. పశువులకు సైతం గాయాలయ్యాయి. చెట్లపై ఉన్న పక్షులు సైతం మృతి చెందాయి. కోళ్లఫారం పూర్తిగా నేల మట్టమయ్యింది. గుండ్లసోమారంలో దాదాపు 10 ఇండ్ల పై కప్పులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు, స్తంభాలు కూలిపోయాయి. ఇక కోతకు వచ్చిన వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. అక్కడక్కడా కోసి ఆరబోసిన ధాన్యం తడిసింది. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీవో దేవేందర్, ఏవో సృజన, ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న ఇండ్లు, పంటలను పరిశీలించారు. నాయకులు గట్టు మల్లేశ్, హరీశ్‌గౌడ్, తోట శ్రీనివాస్, శంకరయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు.

మందమర్రి రూరల్, మే 2 : గురువారం రాత్రి వీచిన గాలులకు పొన్నారం, ఆదిల్‌పేట, మామిడిగట్టు గ్రామాల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. మరో 20 రోజుల్లో కాయలు అమ్మకానికి వస్తాయనగా నేల రాలడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెన్నూర్ రూరల్, మే 2 : కొమ్మెర, పొక్కూర్, ఆస్నాద్, ఎర్రగుంటపల్లి, కిష్టంపేట, ముత్తరావుపల్లి, ఓత్కులపల్లితో పాటు పలు గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. నాగాపూర్‌లో వరద ప్రవాహానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కొట్టుకుపోయింది. అధికారులు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి.

కన్నెపల్లి, మే 2 : లింగాలలోని జంపాల అంజన్న ఇంటి పై కప్పు రేకులు తన కంటింగ్ షాపుపై పడగా, కూలిపోయింది. ప్రభుత్వ నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధితుడు అంజన్న వేడుకుంటున్నాడు.

భీమారం, మే 2 : భారీ వర్షానికి భీమారం మండలంలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. మండలానికి మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం సాయంత్రం వరకూ కరెంట్ సరఫరా చేయలేదు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మామిడి కాయలు రాలిపోయాయి. సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం వద్ద ఉన్న ఇంటి రేకులు లేచిపోయాయి. అందులోని సిమెంట్ బస్తాలు తడిసిపోయాయి. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఓ మహిళా తన కుమారుడితో వచ్చి తీవ్ర ఇబ్బందులు పడింది.



చెన్నూర్ రూరల్ : నాగాపూర్‌లో వరద ప్రవాహానికి కొట్టుకపోయిన ధాన్యం



భీమారం : తడిసిన ధాన్యం నుంచి నీటిని పారబోస్తున్న రైతు



భీమారం : కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



భీమారంలో విరిగి పడ్డ మామిడి చెట్టు



మందమర్రి: మామిడిగట్టులో నేలరాలిన మామిడికాయలు

# ‘ఉపాధి’ పాయె..!

**ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారడంతో పనులకే బ్రేక్**

- దూరమైన 460 కుటుంబాలు
- న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట కూలీల ధర్నా

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్.. మున్సిపాలిటీగా మారడంతో కూలీలు ఉపాధి హామీ పనులకు దూరం కావాల్సి వచ్చింది. ఆసిఫాబాద్ పట్టణంతో పాటు గొడవెల్లి, జన్కాపూర్, హీరాపూర్ గ్రామాలకు చెందిన 460 కుటుంబాలు పనులు లేక ఆందోళన చెందాల్సి వస్తున్నది. సర్కారు, యంత్రాంగం స్పందించి తమకు పనులు కల్పించేలా చూడాలని కోరుతూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు.



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన ఉపాధి హామీ కూలీలు

### ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారడంతో..

కేంద్రం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కూలీలకు పనులు కల్పించాలనే సదుద్దేశంతో ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది. ఇంత కాలం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీగా ఉండడంతో ఆసిఫాబాద్ పట్టణంలోని కూలీలకు కూడా ఉపాధి హామీ పథకం వర్తింపజేశారు. ఆసిఫాబాద్ పరిధిలోని రాజంపేట్ గిరిజన ప్రాంతాన్ని కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ పట్టణంతో పాటు జన్కాపూర్, హీరాపూర్, గొడవెల్లి గ్రామాలను కలిపి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటిగా మారడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఉపాధి హామీ పనులకు దూరం కావాల్సి వచ్చింది.

### 460 కుటుంబాలు.. 700 మంది కూలీలు

ఆసిఫాబాద్ పట్టణంతో పాటు జన్కాపూర్, హీరాపూర్, గొడవెల్లి గ్రామాల్లో దాదాపు 460 కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో సుమారు 700 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కుంటలు, ఫారంపాండ్స్, ఫిష్ పాండ్స్, కాలువల్లో పూడిక తీత, మట్టిరోడ్ల నిర్మాణం, ట్రెంచ్, కాంటూరి కందకాలువంటి 262 పనులు అమలు చేశారు. గతేడాది 410 మంది కూలీలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఉపాధి పనులను అధికారులు నిలిపివేశారు. తాము ఉపాధి కోల్పోయామని.. తమ ప్రాంతాలను రాజంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో చేర్చి ఉపాధి పనులు కల్పించాలని వారు కోరుతున్నారు.

# విద్యార్థులు లక్ష్యం వైపు సాగాలి

ఆసిఫాబాద్ టౌన్,మే 2 : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించే దిశగా సాగాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి గుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొట్టమొదటి 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగా, వారు విద్యార్థులను అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# ఇత్తడి బొమ్మల మార్కెటింగ్‌కు కృషి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

ఉట్నూర్, ఏప్రిల్ 2 : ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు తయారు చేసిన ఇత్తడి బొమ్మలు, వస్తువులను మార్కెటింగ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవన్‌లో ఇత్తడి వస్తువులు తయారీచేసే గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఫిక్కీఫ్లో లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ సంయుక్తంగా మార్కెటింగ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉషేగాం, జంగాం, కేస్లాగూడ, చింతల్‌బోరి రాంపూర్, బండగూడ ప్రాంతాల్లోని 80 మంది గిరిజన కళాకారులకు ఆర్థికంగా మేలు జరుగనుంది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కవితారెడ్డి, దీప్తి, ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# ‘నీట్’కోసం పటిష్టమైన బందోబస్తు

**ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల-కళాశాలలో ఈ నెల 4న నిర్వహించనున్న నీట్ పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇబ్బందుల్లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పోలీస్ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.